'గీత గోవిందం' ను
గుర్తుచేస్తున్న
'ఫ్యామిలీ స్టార్' ట్రైలర్!

4లో.

RNI NO :Title-Code :-TELTEL02102
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 181 శుక్రవారం 29 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# కారు నుండి జంప్!

- బీఆర్ఎస్‌కు సీనియర్ నేత కె.కేశవరావు గుడ్‌బై
- సోనియా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం
- రేపు కాంగ్రెస్‌లోకి కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి
- హఠాత్తుగా వరంగల్ లోక్‌సభ బరి నుంచి తప్పుకున్న కడియం కావ్య
- కడియం శ్రీహరి, కావ్య కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం..
- శ్రీహరి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసే చాన్స్!
- వరుస నిష్క్రమణలతో గులాబీ దళంలో కలవరం





హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త): భారత్ రాష్ట్ర సమితి పార్టీలో గురువారం రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ఆ పార్టీ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు ప్రకటించారు. ఎప్పుడు చేరేది మూడు నాలుగురోజుల్లో వెల్లడిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ ఖరారైన తర్వాత ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాలని కేశవరావు భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు టికెట్ దక్కించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య హఠాత్తుగా బరి నుంచి తప్పుకున్నారు.

మిగతా 2లో.





2లో.

## కేజ్రీవాల్ కు ఊరట

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి కేజ్రీవాల్ ను తప్పించాలన్న పిటిషన్ తిరస్కరణ
విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్
కేసులో అరెస్టయిన సీఎంను తొలగించాలని ఎక్కడుందని సూటిగా ప్రశ్నించిన న్యాయస్థానం

## బండి సంజయ్‌పై కేసు నమోదు



2లో.

విధి నిర్వహణలో ఉన్న తనపై దాడి చేశారని నాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ఫిర్యాదు
ఓ వర్గం దాడిలో గాయపడిన గిరిజన మహిళలను పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో ఘటన

# కొడంగల్ కు పరిశ్రమలు తీసుకొస్తా

- నేను ఎక్కడ ఉన్నా ఓ కన్ను కొడంగల్ పైనే ఉంటుంది: సీఎం రేవంత్ రెడ్డి
- తన ఇంటి వద్ద కార్యకర్తలు, అభిమానులతో సమావేశం
- కొడంగల్‌కు పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్న ముఖ్యమంత్రి
- తాను కష్టాల్లో ఉన్నప్పుడు కొడంగల్ అండగా నిలిచిందని వ్యాఖ్య



2లో.

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త): గురువారం కొడంగల్‌లోని తన నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇక్కడకి పరిశ్రమలను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని... అప్పుడు యువతకు ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు.

# కాళేశ్వరం, కేసీఆర్‌పై ప్రభుత్వానికి కడుపు మంట

## సిరిసిల్ల పర్యటనలో మాజీ మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి,మార్చి28(జర్నలిస్ట్ వార్త): ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరవు.. కాలం తెచ్చింది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.కాళేశ్వరం మీద, కేసీఆర్ మీద కడుపు మంటతో ఈ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహించడంతో రైతుల పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. గురువారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. రైతులు అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు రుణమాఫీ చేయలేదు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కోసం రూ.7 వేల కోట్లు నిల్వ ఉంచితే, వాటిని గుత్తేదారులకు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే.గతంలో కాళేశ్వరం నీటితో తంగళ్లపల్లి



మండలంలోని అన్ని చెరువులను నింపి ఎండాకాలంలో రైతన్నలకు నీరు ఇచ్చాం. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీలో కుంగిపోయిన మూడు పిల్లర్ల వద్ద కాఫర్‌డ్యామ్ కడితే రైతులకు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. దిల్లీకి యాత్రలు చేయడమే మినహా.. రైతుల పంటలను సీఎం, మంత్రులు పరిశీలించిన పాపానపోలేదు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు, ధాన్యంపై బోనస్‌ను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి. దానికి ఎన్నికల కోడ్ అడ్డుకాదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమాలో ఉన్న ఆయనను కలిసిన రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజేంద్రనగర్‌లో వంద ఎకరాల్లో నిర్మించనున్న నూతన హైకోర్టుకు సంబంధించి ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నట్టు తెలిసింది.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో వంద ఎకరాల్లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు నిర్మాణ పనులకు జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎస్వీ భట్టి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో 32 జిల్లా కోర్టులకు ఈ-సేవా కేంద్రాలను ఆన్‌లైన్ ద్వారా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రారంభించారు.



# కారు నుండి జంప్

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ నుంచి పలువురు కీలక నేతల నిష్క్రమణలు కొనసాగుతుండగా.. తాజాగా పార్టీ సెక్రెటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవ రావు (కేకే) కూడా అదే బాట పట్టారు. 'కాంగ్రెస్ పార్టీ నాకు సొంత ఇల్లు లాంటిది. నేను పుట్టింది, పెరిగింది కాంగ్రెస్‌లోనే. 53 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ లోనే పని చేశా. ఆ పార్టీలోనే చనిపోవాలనుకుంటున్నా. తీర్థయాత్రలకు వెళ్లినవారు ఎప్పటికైనా ఇంటికే చేరతారు. 84 ఏళ్ల వయసులో నేను కూడా నా సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరతా..' అని కేకే గురువా రం నాడిక్కడ మీడియాకు చెప్పారు. అంతకుముందు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తో కేకే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అర్ధాంతరంగా ముగిసినట్లు సమాచారం కాగా..ఆ తర్వాత బంజారాహిల్స్ నివాసంలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.



### తెలంగాణ కోసం బీఆర్ఎస్‌లో చేరా

'బీఆర్ఎస్‌లో నేను పని చేసింది పదేళ్లు మాత్రమే. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరా. కానీ కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చింది. నేను మొదటి సారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యా. ప్రస్తుతం నేను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదు. నా కూతురు చేరిన రోజే నేను కాంగ్రెస్‌లో చేరబోవడం లేదు. ఏ రోజు చేరేదీ తేదీ ఖరారు అయిన తర్వాత చెబుతా..' అని కేకే చెప్పారు.

### నేను బీఆర్ఎస్‌లో ఉండి చేసేదేమీ లేదు

'కేసీఆర్ నాకు చాలా గౌరవం ఇచ్చారు. నాకు కూడా ఆయనపై గౌరవం ఉంది. బీఆర్ఎస్ నేతలు, కార్య కర్తలు బాగా సహకరించారు. కానీ సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో పనిచేశా. పీసీసీ అధ్యక్ష పదవి మొదలు కొని రాజ్యసభ వరకు నాకు కాంగ్రెస్ ఎన్నో అవకా శాలు ఇచ్చింది. ప్రస్తుతం రాజకీయ చరమాంకంలో ఉన్న నేను బీఆర్ఎస్ పార్టీలో ఉండి కూడా చేసేదేమీ లేదు.కేసీఆర్‌కు కూడా ఇదే చెప్పా. బీఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై కూడా ఆయనతో మాట్లాడా. కవిత అరెస్టుతో పాటు పార్టీ అంతర్గత అంశాలపైనా చర్చ జరిగింది. కవితను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని అనుకుంటున్న నా కుమారుడు విప్లవ్ నిర్ణయం మంచిదే..' అని కేశవరావు అన్నారు.

పార్టీ మారే విషయంలో తన తండ్రి కేశవరావు, సోదరి విజయలక్ష్మి తీసుకునే నిర్ణయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేకే కుమారుడు విప్లవ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరే విషయంపై వారు స్పష్టత ఇచ్చిన తర్వాతే, దానిపై తన అభిప్రా యం వెల్లడిస్తానని చెప్పారు. తాను మాత్రం పార్టీ మారే ప్రసక్తే లేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్‌కు గట్టి మద్దతుదారుడినని, కేసీఆర్ నాయకత్వంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. కేసీఆర్ ప్రభు త్వంలో విప్లవ్‌కుమార్ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేయడం తెలిసిందే.

కేసీఆర్‌తో భేటీ తర్వాత కేకే బంజారాహిల్స్ లోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి కేకేతో భేటీ అయ్యారు. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా ఇంద్రకరణ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డితో పాటు కేకే కుమా ర్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఈనెల 30న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

### మీ కుటుంబానికి ఏం తక్కువ చేశా?: కేసీఆర్


విశ్వసనీయ సమాచారం మేరకు.. కేసీఆర్‌తో జరిగిన భేటీలో బీఆర్ఎస్‌లో పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలతో కూడిన ఓ నోట్‌ను కేకే అందజేశారు. ఈ సందర్భంగానే కేకేతో పాటు విజయలక్ష్మి పార్టీని వీడుతున్నారనే వార్తలు ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై కేకే వివరణ ఇస్తూ.. రాజకీయంగా ఇదే తన చివరి ప్రయాణం అని, కాంగ్రెస్‌లోనే చనిపోతానని చెప్పారు.ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ యూ ట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో కేకే వెల్లడించిన అభిప్రాయాలపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పదేళ్లు అధికారం, పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారడాన్ని ప్రజలు గమనిస్తారు. మీ ఆలోచన మానుకోండి. మీ కుటుంబానికి పార్టీ తక్కువేమీ చేయలేదు. మీకున్న రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ సెక్రటరీ జనరల్ పదవితో పాటు రెండు పర్యాయాలు రాజ్యసభకు పంపించా. మీ కుమారుడికి కార్పొరేషన్ పదవి ఇచ్చా.మీరు కోరిన మీదటే పార్టీలో ఎంతోమంది నిబద్ధత కలిగిన వారిని పక్కన పెట్టి మరీ మీ కూతురు విజయలక్ష్మికి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పదవి ఇచ్చాం. పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న కీలక సమయంలో పెద్దరికంతో వ్యవహరించాల్సింది పోయి మీడియాలో నాపైనా, పార్టీ నాయకులపైనా విమర్శలు చేయడం సరికాదు..' అంటూ కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరి భేటీ అర్ధంతరంగా ముగిసిందని సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్‌లో మరో ఇద్దరు అరెస్ట్

## : రాధాకిషన్, గట్టు మల్లులను విచారిస్తున్న పోలీసులు

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి.

ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. రాధాకిషన్, గట్టు మల్లులను విచారిస్తున్నారు. వీరు ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ చేశారని గుర్తించారు. ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం.బుధవారం రాత్రి అధికారులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు.. లోతుగా విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఇవాళ అంతా విచారించి.. ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం



జరుగుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్లూ తాకిన సంగతి తెలిసిందే.

ఇప్పటికే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి(ఎస్వోటీ) ఇన్చార్జిగా వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం.

సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునేవారు కాదని భావిస్తున్నారు. ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్లో పాతుకుపోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా.. ఓఎస్డీలుగా కొనసాగారు. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

# కోర్టు ఆదేశించినా... తీహార్ జైలు అధికారులు పట్టించుకోవడం లేదు : కోర్టులో కవిత పిటిషన్

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
తనకు కొన్ని వెసులుబాట్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించినప్పటికీ తీహార్ జైలు అధికారులు వాటిని పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మహిళలకు సంబంధించిన పలు అనారోగ్య సమస్యలు తనకు ఉన్నాయని, రక్తపోటు సమస్య అధికంగా ఉందని... అందుకే తన విజ్ఞప్తి కారణంగా కోర్టు తనకు కొన్ని వెసులుబాట్లు కల్పించిందన్నారు. ఈ మేరకు జైలు అధికారులకు ఆదేశాలు ఇచ్చిందన్నారు.తనకు ఇంటి భోజనాన్ని అనుమతించడం లేదని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. పరుపులు ఏర్పాటు చేయలేదని, చెప్పులు కూడా



అనుమతించడం లేదన్నారు. బట్టలు, బెడ్ షీట్స్, బుక్స్, బ్లాంకెట్స్‌ను అనుమతించడం లేదని తెలిపారు. పెన్ను, పేపర్లను అందుబాటులో ఉంచడం లేదని, కనీసం కళ్ళజోడును కూడా అనుమతించడం లేదన్నారు. చేతికి వున్న జపమాలను కూడా అనుమతించలేదని ఆరోపించారు.జైలు అధికారుల తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. తనకు వెసులుబాట్లు కల్పించేలా తీహార్ జైలు సూపరింటిండెంట్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని అందులో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం... శనివారం విచారణ జరుపుతామని తెలిపింది.

# కొడంగల్ కు పరిశ్రమలు తీసుకొస్తా

మార్చి 28 జర్నలిస్టు జర్నీ న్యూస్:
గురువారం కొడంగల్‌లోని తన నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇక్కడకి పరిశ్రమలను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని... అప్పుడు యువతకు ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొడంగల్ నుంచే 50వేల మెజార్టీ రావాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు సెలవులు వస్తాయి కాబట్టి ఇతర కార్యక్రమాలు పెట్టుకుంటారని, కానీ ఓటు చాలా ముఖ్యమని గుర్తుంచుకోవాలన్నారు. తనకు ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఓటు వేసేందుకు కొడంగల్ వచ్చినట్లు చెప్పారు.కార్యకర్తలను కలవాలని వచ్చానని చెప్పారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కొడంగల్ ప్రజలు తన వెంటే ఉన్నారని పేర్కొన్నారు. తాను ప్రచారానికి రాకపోయినప్పటికీ గెలిపించారన్నారు. ఇక్కడకు సిమెంట్ పరిశ్రమ రాబోతుందని... పరిశ్రమలు వస్తే మన భూముల ధరలు కూడా పెరుగుతాయన్నారు. ఏప్రిల్ 6న జరిగే తుక్కుగూడ కాంగ్రెస్ బహిరంగ సభకు కొడంగల్ నుంచి 25వేల మంది తరలి రావాలన్నారు. ఈ సభలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని, దేశవ్యాప్తంగా ఐదు గ్యారెంటీలు ప్రకటిస్తారన్నారు.

# బీజేపీ నేత బండి సంజయ్‌పై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. విధి నిర్వహణలో ఉన్న తనపై దాడి చేశారని నాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదు చేశారు. బండి సంజయ్‌తో పాటు ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మరికొందరిపై కేసు నమోదయింది. ఓ వర్గం దాడిలో గాయపడిన మహిళలను పరామర్శించేందుకు బండి సంజయ్ నిన్న చెంగిచెర్లలోని పిట్టలబస్తీకి వెళ్లారు.బండి సంజయ్ అక్కడకు రావడంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడకు రావడానికి అనుమతి లేదని పోలీసులు చెప్పారు. ఎవరినీ లోపలికి అనుమతించకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అక్కడకు చేరుకున్న బండి సంజయ్, కార్యకర్తలు బారికేడ్లను తోసుకొని లోపలికి వెళ్లారు. ఘటనలో గాయపడిన మహిళలను పరామర్శించారు. వారికి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.మహిళలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు, కబేళా నిర్వాహకులు కక్షతో పేద గిరిజన మహిళలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. బస్తీకి వచ్చి మరీ మహిళలు, పిల్లలపై దాడులు చేశారని, ఇందుకు కారకులైన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో తన విధులకు ఆటంకం కలిగించారని, తనపై దాడి చేశారని నాచారం సీఐ ఫిర్యాదు చేశారు.



# కేజ్రీవాల్ కు ఊరట


హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్ ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన సంగతి తెలిసిందే. ఢిల్లీకి చెందిన సూర్జిత్ సింగ్ అనే సామాజిక కార్యకర్త ఈ పిల్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్ ను ఢిల్లీ హైకోర్టు నేడు తిరస్కరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుటకు ఈ పిల్ నేడు విచారణకు వచ్చింది. అరెస్ట్ అయిన ముఖ్యమంత్రి పదవిలో ఉండడానికి అనర్హుడు అనేందుకు పిటిషనర్ తగిన ప్రామాణిక అంశాలను చూపించలేకపోయారని ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. "కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రిని తొలగించాలంటున్నారు... ఆ నిబంధన ఎక్కడుందో చూపించండి. మీరు చెబుతున్న న్యాయపరమైన కొలమానం మాకు చూపించండి" అంటూ పిటిషనర్ ను ధర్మాసనం కాస్త గట్టిగానే ప్రశ్నించింది. అంతేకాదు, కేసు దర్యాప్తు ఈ దశలో ఉన్నప్పుడు న్యాయస్థానాల జోక్యానికి అవకాశమే లేదని స్పష్టం చేసింది.ద



# అవినీతిపరులపై సీఎం చర్యలేవి?

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ జరపాలిరాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ డిమాండ్

హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతిపరులను జైలులో వేస్తామని మాటలకే పరిమితమ య్యాడు తప్ప చర్యలు లేవని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డి .. లీక్ వీరుడు కాదు.. గ్రీక్ వీరుడు అని నిరూపించు కోవాలనుకుంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో పాత్రదారులు, సూత్రదా రులను కూడా బయటపెట్టాలన్నారు. కవిత లిక్కర్ కేసులో అరెస్ట్ అయ్యారు.. పోన్ ట్యాపింగ్ తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో కూడా కేసీఆర్ ప్రభుత్వం పాల్పడిరది. తెలంగాణ సంపదను దోచుకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారని.. అయినా సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి అవకతవకలపై చర్యలు లేవు.. డ్రగ్స్ కేసులు పత్తా లేవని ధ్వజమెత్తారు. హైద రాబాద్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ దుర్మార్గాల ను, అవినీతిపై నిప్పులు చెరిగారు. నియం తృత్వంగా వ్యవహరించే వారు నీడను కూడా నమ్మరని.. కేసీఆర్ కూడా ఎవరినీ నమ్మలేదని.. అందుకే రాజకీయ, మీడియా ప్రముఖులు, పలువురు బ్యూరో క్రాట్ల ఫోన్లు ట్యాపింగ్, వ్యాపారులను బ్లాక్మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్కు పాల్పడితే.. సందట్లో సడేమియా అన్నట్టుగా అధికారులు సర్దుకున్నారని దుయ్యబట్టారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తాటాకు చప్పుడు కాదని నిరూపించుకోవాలని లక్ష్మణ్ సవాల్ విసిరారు.



## అనుమతి వున్న తుపాకులను
# పోలీస్ స్టేషన్లో అప్పగించండి

### - వరంగల్ పోలీస్ కమిషనర్ కిషోర్ ఝా



**వరంగల్, మార్చి28(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు వున్న తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశించారు. పార్లమెంట్ ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో, ఎన్నికల వేళ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా ఆయుధాల చట్టాన్ని అనుసరించి, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు వున్న తుపాకులను కలిగి వున్న వ్యక్తులు, ప్రవైట్ సంస్థలు తమ వద్ద వున్న తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించాల్సి వుంటుందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 అనుమతి వున్న తుపాకులు వున్నాయన్నారు. ఇందులో హనుమకొండజిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 అనుమతులు వున్న తుపాకులు ఉన్నాయని వెల్లడించారు. తుపాకులు పొందిన వారు తప్పక స్థానిక పోలీస్ స్టేషన్లో అందజేయాలన్నారు. ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి ఎవరి తుపాకులు వారికి అందజేయడం జరుగుతుందన్నారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### - జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**హనుమకొండ, మార్చి28(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో యాసంగి 2023–24 సంవత్సరంలో ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, ధాన్యం కొనుగోళ్లను చేపట్టే మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు, ధాన్యం తరలించే లారీ ఓనర్ల సంఘం, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఏప్రిల్ 1వ, తేదీన జిల్లాలోని ప్రతి మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో అన్నిచోట్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై, ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 146 దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఏరోజు రైతుల నుండి కొనుగోలు చేస్తారో ఆ ధాన్యం వివరాలను అదేరోజు నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 5 రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయని అన్నారు. కల్లాల వద్దనే ధాన్యం ఆరబోసుకునే విధంగా రైతులకు తెలియజేయాలన్నారు. ధాన్యంలో తేమ శాతం లేకుండా చూసుకోవాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, డీఆర్డీవో నాగ పద్మజ, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి రవీందర్ సింగ్, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏసిఎస్ఓ నరసింహారావు, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



హనుమకొండ, మార్చి28(జర్నలిస్ట్ వార్త): వేసవి కాలం ముగిసేంత వరకూ గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా పై గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారులు, ఎంపిడివోలు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా, మండలం, గ్రామాలలో త్రాగునీటి సంబంధించి బోర్లు, బావులు, చేతి పంపులు, మిషన్ భగీరథ నీటి సరఫరా,మోటార్లు, పైపులైన్ల మరమ్మతులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో త్రాగునీటి సరఫరాకి సంబంధించి అధికారులు వేసవికాలం ముగిసేంతవరకు ప్రతిరోజు సమస్యల పరిష్కారానికి సమీక్ష నిర్వహించాలన్నారు. త్రాగునీటి సరఫరాకి సంబంధించి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సరఫరాకు సంబంధించి వివిధ దశల్లో పురోగతిలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జడ్పీ సీఈవో విద్యాలత, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం, ఆర్డబ్ల్యూఎస్ డిఈలు సునీత, శ్వేత, ఎంపీడీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఈడీ దాడులు సరికాదు

### : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**కేంద్రంలో బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతామన్న ప్రవీణ్ కుమార్**

**రిజర్వేషన్ల తీసివేతకు కేంద్రం కుట్రలు చేస్తోందని వ్యాఖ్య**

**బీజేపీ, కాంగ్రెస్‌లను గద్దె దించాలని ప్రజలకు పిలుపు**



**మార్చి28(జర్నలిస్ట్ వార్త):** దేశంలో ఈడీ దాడులు సరికాదని బీఆర్ఎస్ నాగర్ కర్నూల్ లోక్ సభ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబానికి పేద ప్రజల బాధలు తెలియవని విమర్శించారు. ఆస్తులు కాపాడుకోవడం కోసం ఆయన కుటుంబం ఆరాటపడుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల తీసివేతకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు.

తెలంగాణలో పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ అంతా బూటకమన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేస్తోన్న బీఆర్ఎస్ అభ్యర్థులను ఈ లోక్ సభ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# కమ్యూనిస్టుల మద్దతు కావాలి

### కరీంనగర్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరిన పొన్నం



**మార్చి28(జర్నలిస్ట్ వార్త):** కమ్యూనిస్టు పార్టీలను ఉద్దేశించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీకి సంబంధించి తాజా రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా సీపీఐ, సీపీఎం పార్టీలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నానని విన్నవించారు. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 13 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ స్థానాలను పెండింగ్ లో ఉంచింది. ఈ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్, సీపీఐ పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. పొత్తులో భాగంగా కొత్తగూడెం అసెంబ్లీ సీటును సీపీఐకి కేటాయించగా... ఆ పార్టీ తరఫున కూనంనేని సాంబశివరావు గెలుపొందారు. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లో కూడా పొత్తు ధర్మంలో భాగంగా ఒక ఎంపీ సీటును కేటాయించాలని కాంగ్రెస్ ను సీపీఐ కోరుతోంది. వరంగల్, కరీంనగర్ స్థానాల్లో ఏదో ఒక స్థానాన్ని ఇవ్వాలని అడుగుతోంది. ఈ నేపథ్యంలో పొన్నం ప్రభాకర్ చేసిన ట్వీట్ ఆసక్తికరంగా మారింది. పొన్నం ట్వీట్ పై కమ్యూనిస్టులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## 108 వాహనంలో ప్రసవించిన గర్భిణీ



రాయపర్తి, మార్చి28(జర్నలిస్ట్ వార్త): 108 వాహనంలో ఓ గర్భిణి ప్రసవించి మగ శిశువుకి జన్మనిచ్చిన సంఘటన గురువారం రాయపర్తి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన చిన్నపాక పూజ పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనం కోసం కాల్ చేశారు. ఫోన్ చేసిన కొద్ది సమయానికి 108 వాహనం బాధితురాలి వద్దకు చేరుకుంది. అనంతరం గర్భిణిని వర్ధన్నపేట హాస్పిటల్ కు తరలిస్తున్న క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువై మార్గ మధ్యలోనే 108 వాహనంలో ప్రసవించింది. 108 వాహనానికి చెందిన సిబ్బంది మహిళకు చికిత్స చేసి, మగ బిడ్డకు పురుడు పోశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం వర్ధన్నపేట ప్రభుత్వ హాస్పిటల్ తరలించడం జరిగిందని 108 సిబ్బంది రవి తెలిపారు.

## మంద కృష్ణ మాదిగని కలిసిన
# బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



వరంగల్, మార్చి28,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ప్రస్తుతం బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా తెలిశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తప్పని సరి పరిస్థితుల్లో తప్పుకుని, బిజెపి పార్టీలో చేరి ఎంపీ అభ్యర్థిగా అవకాశాన్ని సాధించుకున్న ఆయనని మందకృష్ణ మాదిగ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

# వేములవాడలో వైభవంగా
# శ్రీ పార్వతీ రాజరాజేశ్వరుల కల్యాణం



**సిరిసిల్ల,మార్చి28(జర్నలిస్ట్ వార్త):** : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామిల కల్యాణం (శివ కల్యాణం) గురువారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు.

అన్ని శైవాలయాల్లో శ్రీ శివకల్యాణాన్ని మహాశివరాత్రి నాడు నిర్వహిస్తుం డగా శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మాత్రం కామ దహనానంతరం (హోలీ పండుగ) అనంతరం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజన్న గుడిలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామిల కల్యాణాన్ని నిర్వహించగా వేలాది శివపార్వతులు, జోగినులు, వందలాది హిజ్రాలు పాల్గొన్నారు.

ఆలయంలో ఉదయం శ్రీస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన పిదప దేవస్థానం పడమటి గేటు వద్ద ఏర్పాటు చేసిన వేదిక పై కల్యాణాన్ని నిర్వహించగా కన్యాదాతలుగా అప్పాల భీమాశంకర్ శర్మ,ఇందిరలు వ్యవహరించగా వేదపండితులు శరత్ చంద్ర,రాజేశ్వర శర్మ తదితరుల అధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి కల్యాణాన్ని నిర్వహించారు.

ఈ కల్యాణాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం పూర్తిగా నిండిపోగా రోడ్డుపై వందలాది భక్తులు వేచి ఉండి ఎల్ఇడి తెరపై కళ్యాణాన్ని చూశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలను దేవస్థానం ఈఓ కృష్ణ ప్రసాద్,వేములవాడ మున్సిపాలిటి తరపున మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌లు సమర్పించారు. ఈ కల్యాణం లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

# ఎస్‌బీఐ కార్డులు ఉపయోగిస్తున్నారా?

## పీఎఫ్‌తో అధికంగా పన్ను ఆదా చేసుకోవచ్చు




ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయడానికి తుది గడువు సమీపిస్తోంది. మార్చి 31లోపు పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అందరూ పన్ను ఆదా చేసే పథకాల కోసం వెతుకుతుంటారు. చాలా పథకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ.. సంప్రదాయ పెట్టుబడి పథకం, ఉద్యోగులం దరికీ తప్పనిసరిగా ఉండే ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్) అధిక ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. నిజానికి ఈ పథకం ఉద్యోగులు పదవీవిరమణ కోసం ఉద్దేశించినది. అయినప్పటికీ ఇది పన్ను ఆదా చేయడంలో ఉద్యోగులకు సాయపడుతుంది. ఈ నేపథ్యంలో దీనికి ఈపీఎఫ్ కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ అనేది పదవీ విరమణ కోసం అధిక మొత్తంలో నగదు సమకూర్చుకునేందుకు ఉపయోగపడే పథకం. ఇది 1952లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్ చట్టం రూపంలో అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దీనిని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నిర్వహిస్తోంది. ఈపీఎఫ్ పథకంలో, ఉద్యోగులు ప్రతి నెలా వారి ప్రాథమిక ఆదాయంలో 12% విరాళంగా అందించాలి. అలాగే వారి యజమాని ఈ మొత్తానికి సరిసమానంగా వారు ఖాతాలో జమచేస్తారు. మీరు పదవీ విరమణ చేసినప్పుడు, మీరు వడ్డీతో సహా మొత్తం మొత్తాన్ని ఒకేసారి అందుకుంటారు. ఈపీఎఫ్ చాలా తక్కువ-రిస్క్ పెట్టుబడిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది భారత ప్రభుత్వంచే నిర్వహించబడుతుంది. ఇది స్థిరమైన రాబడికి హామీ ఇస్తుంది. యజమాని సహకారంలో దాదాపు 8.33% ఎంప్లాయి పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్)కి కేటాయిస్తారు. ఉదాహరణకు, మీ నెలవారీ ప్రాథమిక జీతం రూ. 1,00,000 అయితే మీరు ఈపీఎఫ్ కి చెల్లించే కాంట్రిబ్యూషన్ రూ. 12,000 (మీ ప్రాథమిక జీతంలో 12%). దీని నుంచి మీరు పన్ను ఆదా చేసుకోవచ్చు. అదెలా అంటే మీరు సెక్షన్ 80సీ కింద సంవత్సరానికి రూ. 1,44,000 (12 %ఞ% రూ. 12,000) తగ్గింపును క్లెయిమ్ చేయవచ్చు. తద్వారా ఈపీఎఫ్ సభ్యులకు ఆధారపడదగిన రిటైర్మెంట్ ఫండ్ మూలాన్ని అందించడమే కాకుండా, పన్ను ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అదే విధంగా సెక్షన్ 80సీ కిందే దీనిలో వచ్చే వడ్డీని కూడా పన్ను రహితంగా పొందొచ్చు. రూ. 1,50,000 వరకూ పన్ను రహిత వడ్డీని పొందొచ్చు.

## పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్!

**న్యూఢిల్లీ:** బజాజ్ ఫైనాన్స్‌లో ఓ విభాగంగా ఉన్న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్.. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కంపెనీ తన విలువను సుమారు 9-10 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.75,000-83,000 కోట్లు)గా అంచనా వేసుకుంటూ, అందుకనుగుణంగా వాటాల విక్రయం ద్వారా నిధులు సమీకరించాలని భావిస్తోందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం పలు దేశీయ, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. రూ.7500 కోట్ల సమీకరణ లక్ష్యం?: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో 'అప్పర్ లేయర్' కింద గుర్తింపు పొందిన సంస్థలు.. వాటిని నోటిఫై చేసిన తేదీ నుంచి మూడేళ్లలోగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలన్నది ఆర్‌బీఐ నిబంధన. 16 ఎన్‌బీఎఫ్‌సీలతో అప్పర్‌లేయర్ జాబితాను ఆర్‌బీఐ 2022 సెప్టెంబరు 30న విడుదల చేసింది. ఇందులో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు టాటా సన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, టాటా కేపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లాంటివి ఉన్నాయి.

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తమ ఖాతాదారులకు ఒక బ్యాడ్ న్యూస్ చెప్పింది. ఎస్‌బీఐ కార్డులపై ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏ బ్యాంక్ అయిన తమ ఖాతాదారులకు అందించే కార్డులపై ఛార్జీలు వసూలు చేస్తుందనే విషయం తెలిసిందే. ఈ ఛార్జీలను బ్యాంకులు ఏడాదికి ఒకసారి అకౌంట్ హోల్డర్స్ నుంచి వసూలు చేస్తాయి. అయితే తాజాగా ఈ ఛార్జీలను పెంచుతూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకుంది.కొన్ని డెబిట్ కార్డులకు సంబంధించిన వార్షిక మెయింటెనెన్స్ ఛార్జీలను పెంచుతున్న ఎస్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. పెంచిన ఈ ఛార్జీలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందులో భాగంగా ఎస్‌బీఐ క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై ఛార్జీలను ఏకంగా రూ. 75 పెంచేసింది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీ రూ. 125తో పాటు అదనంగా జీఎస్టీ ఉండగా ప్రస్తుతం దీనిని రూ. 200లతో పాటు జీఎస్టీకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇక యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డ్, మై కార్డ్ (ఇమేజ్ కార్డ్) వాంటి వాటిపై ఏకంగా 50 శాతం మేర ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీలు రూ. 175ం జీఎస్టీగా ఉండగా, ప్రస్తుతం రూ. 250ం జీఎస్టీకి పెంచచారు. వీటితో పాటు ప్లాటినమ్ డెబిట్ కార్డు ఛార్జీలను కూడా పెంచేశారు. వీటిపై యాన్యువల్ ఛార్జీలను 30 శాతం పెంచారు. ప్రస్తుతం వీటిపై ఏడాదికి రూ. 250 ప్లస్ జీఎస్టీగా ఉండగా, రూ. 325కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బీఐ ప్రైడ్ ప్రీమియమ్ బిజినెస్ డెబిట్ కార్డు వంటి వాటి ప్రీమియం కార్డుల ఛార్జీల్ని రూ. 350 ప్లస్ జీఎస్టీ నుంచి రూ. 425 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించింది. ఇక్కడ జీఎస్టీ ప్రతి దాంట్లో 18 శాతంగా ఉంటుంది. ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో యూజర్లపై భారం పడనుంది.




## ఫేస్‌బుక్‌పై సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ: మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని ఫేస్‌బుక్‌పై సంచ˘లన ఆరోపణలకు సంబంధిచిన పత్రాలు బయటకొచ్చా యి. స్నాప్‌చాట్, యూట్యూబ్, అమెజాన్ వంటి ప్రత్యర్థి ప్లాట్‌ఫామ్‌ల యూజర్లపై ఫేస్‌బుక్ స్నూపింగ్ (అనైతిక విశ్లేషణ) చేసినట్లు ఆరోపిస్తూ కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టు కొత్త పత్రాలను విడుదల చేసింది. 'టెక్ క్రంచ్' కథనం ప్రకారం.. స్నాప్‌చాట్ యాప్‌కి, తమ సర్వర్‌లకు మధ్య నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను అడ్డగించడానికి, డీక్రిప్ట్ చేయడానికి ఫేస్‌బుక్ 2016లో 'ప్రాజెక్ట్ ఘోస్ట్‌బస్టర్స్' అనే రహస్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. కోర్టు పత్రాల ప్రకారం.. యూజర్ బిహేవియర్‌ను అర్థం చేసుకోవడానికి, స్నాప్‌చాట్‌పై ప్రయోజ నాన్ని పొందేందుకు ఫేస్‌బుక్ ఈ చొరవను రూపొందించింది. ఈ పత్రాల్లో రహస్య ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించిన ఫేస్‌బుక్ అంతర్గత ఈమెయిల్‌లు కూడా ఉన్నాయి. 2016 జూన్ 9 నాటి అంతర్గత ఈమెయిల్‌లో ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ స్నాప్‌చాట్‌లో ఎన్‌క్రిప్టెడ్ ట్రాఫిక్ ఉన్నప్పటికీ దానిలో విశ్లేషణలను పొందాలని ఉద్యోగులను ఆదేశించి నట్లుగా ఉంది. దీంతో నిర్దిష్ట సబ్‌డొమైన్‌ల ట్రాఫిక్‌కు అంతరా యం కలిగించడానికి 2013లో ఫేస్‌బుక్ ద్వారా పొందిన వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ 'ఒనావో'ను ఉపయోగించాలని ఫేస్‌బుక్ ఇంజనీర్లు ప్రతిపాదించారు. ఒక నెల తర్వాత, వారు ఐవోఎస్, ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారమ్‌లలో ఇన్‌స్టాల్ చేయగల ప్రతిపాదన కిట్‌లను అందించారు. ఈ ప్రాజెక్ట్‌ను అమెజాన్, యూట్యూబ్ యూజర్ల డేటా కోసం విస్తరించారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల బృందంతో పాటు దాదాపు 41 మంది న్యాయవాదులు ప్రాజెక్ట్ ఘోస్ట్‌బస్టర్స్‌లో పనిచేశారు. ఓనావోను ఉపయోగించడానికి ఫేస్‌బుక్ టీనేజర్‌లకు రహస్యంగా డబ్బు చెల్లిస్తోందని దర్యాప్తులో వెల్లడైన తర్వాత, ఫేస్‌బుక్ 2019లో ఒనావోను మూసివేసింది.

## ఐకార్-ఐఐఆర్ఆర్‌కు రూ.4.5 కోట్ల మద్దతు

**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)ను కొనసాగిస్తోంది. బుధవారం హైదరాబాద్‌కు అధికారిక పర్యాటనకు వచ్చిన ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ) చల్లా శ్రీనివాసులు శెట్టి పలు కార్యక్రమాల్లో పాల్గన్నారు. కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో ఐకార్ఐఐఆర్ఆర్‌తో జరిగిన ఎస్‌బిఐ ఫౌండేషన్ ఒప్పందానికి హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే 'మంచికళలు' ఎన్‌జిఒకు టాటా వింగర్ మినిబస్‌ను అందించారు. మంచికళలు ఫౌండర్ ప్రెసిడెంట్ శరత్ కుమార్ పుప్పలకు వాహన తాళం చెవులను బహుకరించారు."శరత్ కుమార్ సేవలు ప్రశంసనీయం. కార్పొరేట్ సామాజిక సేవ కోసం చెక్కులు రాయడం సులభమే.. కానీ సరైనా ఎన్‌జిఒను గుర్తించి సాయం చేయడమే క్లిష్టమైన అంశం. ఎస్‌బిఐ ఫౌండేషన్ ద్వారా అడవి ప్రాంతాల్లోని 112 జిల్లాల్లో మొబైల్ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలనేది మా సంకల్పం." అని సిఎస్ శెట్టి అన్నారు. ఐకార్-ఐఐఆర్ఆర్‌కు ప్రొమోషన్ ఆఫ్ డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్) కోసం ఏకంగా రూ.4.5 కోట్ల విలువ చేసే చెక్కును ఆయన అందజేశారు.

# విహారికి షోకాజ్ నోటీస్..
# కెప్టెన్సీ కోల్పోయాక ఇదే ఫస్ట్




క్రికెటర్ హనుమా విహారి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. క్రికెట్ అసోసియేషన్ తాజాగా విహారికి షోకాజ్ నోటీస్ పంపింది. అర్థాంతరంగా కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో పాటు భవిష్యత్‌లో ఆంధ్రాకు ఆడనని చెప్పడానికి కారణం ఏంటో చెప్పాలని ఆదేశించింది. ఈ విషయాన్ని మరింత పెద్దది చేయకూడదని ఏసీఏ భావిస్తోందని ఏసీఏ అధికారి ఒకరు తెలిపారు. 'గత నెలలో విహారి ఎందుకు అలాంటి కామెంట్స్ చేశాడో తెలుసుకోవాలి అనుకుంటున్నాం. ఇప్పటివరకూ అతడు మమ్మల్ని కాంటాక్ట్ కాలేదు. అతడు ఏమైనా చెప్పదలచుకునేందుకు ఇదొక మంచి అవకాశం. ఆంధ్రా క్రికెట్‌కు విహారి చేసిన సేవను మేము గుర్తిస్తున్నాం. అతడు దేశవాళీలో పలు స్థానాల్లో ఆడాడు' అని సదరు అధికారి చెప్పాడు. ఆస్ట్రేలియాలో 2021-22లో భారత జట్టు టెస్టు సిరీస్ నెగ్గడంలో విహారి కీలక పాత్ర పోషించాడు. అయితే.. గాయం కారణంగా ఆ తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే.. దేశవాళీలో ఆంధ్రా క్రికెట్ జట్టు తరపున సంచలన ప్రదర్శన చేశాడు. కానీ, అనూహ్య పరిస్థితుల్లో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అంతేకాదు భవిష్యత్‌లో ఆంధ్రా జట్టుకు ఆడనని వెల్లడించాడు. ' ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నన్ను ఎంతో వేధనకు గురి చేసింది. నా ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసింది. ఓ రాజకీయ నాయకుడి కుమారుడి కోసం నన్ను బలి చేశారు' అని విహారి తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దాంతో, ఆంధ్రా క్రికెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. రంజీ ట్రోఫీ 2023-24 క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రా జట్టు ఓడిపోయింది. మధ్యప్రదేశ్ చేతిలో 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈమ్యాచ్ అనంతరం విహారి తాను ఆంధ్రా జట్టును వీడుతున్నట్టు పోస్ట్ పెట్టాడు. రాజకీయ బలమున్న పృథ్వీ రాజ్‌కు వత్తాసు పలికి తనను కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఆదేదనకు గురయ్యాడు. విహారి ఆంధ్రా తరఫున 37 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అంతకంటే ముందు అతడు హైదరాబాద్‌కు ఒక సీజన్ మొత్తం ప్రాతినిధ్యం వహించాడు.

## చెత్త కెప్టెన్సీ.. హార్దిక్‌పై మాజీ పేసర్ల విమర్శలు



క్వెనా మఫాకా నాలుగు ఓవర్లలో 66 పరుగులు- నో వికెట్.. హార్దిక్ పాండ్యా నాలుగు ఓవర్లలో 46 రన్స్- ఒక వికెట్.. గెరాల్డ్ కోయెట్జి నాలుగు ఓవర్లలో 57 పరుగులు- ఒక వికెట్... పీయూశ్ చావ్లా రెండు ఓవర్లలో 34 పరుగులు- ఒక వికెట్.. షామ్స్ ములానీ రెండు ఓవర్లు 33 పరుగులు- నో వికెట్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం నాటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ల ప్రదర్శన ఇది. ఈ మ్యాచ్‌లో కాస్త మెరుగ్గా బౌలింగ్ చేసింది ఎవరైనా ఉన్నారంటే.. ముంబై ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే.. తన నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసిన ఈ ఫాస్ట్‌బౌలర్ 36 పరుగులతో సరిపెట్టాడు. మ్యాచ్ ఫలితాన్ని పక్కనపెడితే.. పరుగుల వరద పారుతున్న పిచ్‌పై తన అనుభవం, నైపుణ్యాలు ఏమిటో బుమ్రా మరోసారి నిరూపించుకున్నాడు. మరోవైపు.. బుమ్రాను కాదని అనామక బౌలర్‌తో ఫస్ట్ ఓవర్ వేయించిన కెప్టెన్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనామక బౌలర్‌తో అటాక్‌ను ఆరంభించడం పట్ల ఇర్ఫాన్ పఠాన్, బ్రెట్ లీ వంటి మాజీ పేసర్లు హార్దిక్ పాండ్యాపై మండిపడ్డారు. ఐపీఎల్ ఎక్స్‌పర్ట్ బ్రెట్ లీ జియో సినిమా షోలో మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రాతో తొలి ఓవర్ వేయించకుండా ముంబై ఇండియన్స్ మరోసారి తప్పుచేసింది. గత మ్యాచ్‌లోనూ ఇలాగే చేశారు. బుమ్రాను ఆరంభంలోనే బరిలోకి దింపితే మ్యాచ్ మరోలా ఉండేది'' అని అభిప్రాయపడ్డాడు. మరోవైపు.. ఇర్ఫాన్ పఠాన్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో పాండ్యా కెప్టెన్సీ అత్యంత సాధారణంగా ఉంది. బుమ్రాను ఆలస్యంగా తీసుకువరావడం ఎవరి ఊహకు అందనది. ఇక లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ బ్యాటర్లంతా 200 స్ట్రైక్‌రేటుతో ఆడుతుంటే.. కెప్టెన్ మాత్రం 120 స్ట్రైక్‌రేటుతో ఆడటం ఏమిటో?" అంటూ పాండ్యా ఆట తీరు, కెప్టెన్సీపై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. కాగా ఉప్పల్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై.. సన్‌రైజర్స్ చేతిలో 31 పరుగులతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పాండ్యా ఒక వికెట్ తీయడంతో పాటు.. 20 బంతుల్లో 24 పరుగులు చేశాడు.

## ఐపీఎల్‌లో టాప్-2 స్కోర్లు.. కామన్‌గా ఒకే ఆటగాడు!

ఐపీఎల్ 2024లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో 277 పరుగులు చేసిన సన్‌రైజర్స్.. లీగ్ చరిత్రలోనే అత్యధిక టీమ్ స్కోర్‌ను నమోదు చేసిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ ఈ రికార్డును నెలకొల్పే క్రమంలో ఆర్సీబీ పేరిట ఉండిన పాత రికార్డును బద్దలు కొట్టింది. 11 ఏళ్ల కిందట 2013 సీజన్‌లో ఆర్సీబీ.. పూణే వారియర్స్‌పై చేసిన 263 పరుగులే నిన్నటి మ్యాచ్‌కు ముందు వరకు ఐపీఎల్‌లో అత్యధిక టీమ్ స్కోర్‌గా ఉండింది. ఐపీఎల్‌లో టాప్-2 స్కోర్‌లు నమోదైన సందర్భాల్లో ఓ ఆటగాడు కామన్‌గా ఉండటం అందరి దృష్టిని ఆకర్శిస్తుంది. ప్రస్తుత సన్‌రైజర్స్ ఆటగాడు జయదేవ్ ఉనద్కత్ 2013లో ఆర్సీబీతో.. ప్రస్తుతం సన్‌రైజర్స్‌లో ఉన్నాడు. ఈ విషయం గురించి తెలిసి నెటిజన్లు ఉనద్కత్‌ను లక్కీ లెగ్‌గా పరిగణిస్తున్నారు. భారీ స్కోర్లు నమోదు కావాలంటే ఉనద్కత్ ఉండాల్సిందేనంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయమేమిటంటే.. రెండు మ్యాచ్‌ల్లో ఉనద్కత్ ప్రత్యర్థులపై రెండేసి వికెట్లు పడగొట్టాడు. ఇదిలా ఉంటే, ముంబై ఇండియన్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో ట్రవిస్ హెడ్ (24 బంతుల్లో 62బీ 9 ఫోర్లు, 3 సిక్సర్లు), అభిషేక్ శర్మ (23 బంతుల్లో 63బీ 3 ఫోర్లు, 7 సిక్సర్లు), క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్‌బీ 4 ఫోర్లు, 7 సిక్సర్లు), మార్క్రమ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సర్ సాయంతో 42 నాటౌట్) విధ్వంసం సృష్టించడంతో సన్‌రైజర్స్ 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆరెంజ్ ఆర్మీ.. నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేయగా.. ఛేదనలో ముంబై నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసి లక్ష్యానికి 32 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 34బీ 2 ఫోర్లు, 4 సిక్సర్లు), రోహిత్ శర్మ (12 బంతుల్లో 26బీ ఫోర్, 2 సిక్సర్లు), నమన్ ధిర్ (14 బంతుల్లో 30బీ 2 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (34 బంతుల్లో 64బీ 2 ఫోర్లు, 6 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 42 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 3 సిక్సర్లు) సన్‌రైజర్స్‌కు దడ పుట్టించారు.






# సంక్రాంతి బరిలోకి దిగుతున్న 'కాంతార' ప్రీక్వెల్

రిషభ్ శెట్టి కథానాయకుడిగా రూపొందిన 'కాంతార' 2022 సెప్టెంబర్ 30వ తేదీన థియేటర్లకు వచ్చింది. కన్నడలో భారీ విజయాన్ని సాధించిన ఈ సినిమా, పాన్ ఇండియా స్థాయిలో సంచలనాన్ని సృష్టించింది. తెలుగులో కూడా ఈ సినిమా కాసుల వర్షాన్ని కురిపించింది. అప్పటి నుంచి ఈ సినిమా సీక్వెల్ కోసం అంతా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ ఉంటుందని ప్రకటించారు. కొంత కాలంగా అందుకు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగినట్టుగానే అన్నింటినీ ప్లాన్ చేసుకుంటున్నారు. 'కాంతార' కథ మొదలు కావడానికి ముందు ఏం జరిగింది అనే దాని దగ్గర నుంచి ఈ కథ మొదలవుతుంది. 'కాంతార' సినిమాను కేవలం 16 కోట్ల బడ్జెట్ తో నిర్మించారు. అలాంటి ఈ సినిమా మిగతా భాషల్లోను కలుపుకుని, 450 కోట్ల వరకూ సంపాదించింది. అందువలన ప్రీక్వెల్ కి కాస్త గట్టిగానే ఖర్చు చేస్తున్నారు. 'కాంతార' ఫస్టు మించి ఈ సినిమా ఉంటుందని అంటున్నారు. సంక్రాంతికి తెలుగులో గట్టి పోటీ ఉంటుంది.

# బ్లాక్ డ్రెస్ లో వైట్ బ్యూటీ

తెలుగు ప్రేక్షకులకు ఆపరేషన్ వాలంటైన్ సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మానుషి చిల్లర్. హర్యానాకు చెందిన ఈ అమ్మడు 67వ ప్రపంచ సుందరి కిరీటం గెలుచుకుంది. భారత్ తరపున ఈ కిరీటం దక్కించుకున్న ఆరవ యువతిగా మానుషి చిల్లర్ నిలిచింది. మోడలింగ్ నుంచి బాలీవుడ్ లో అడుగు పెట్టిన ఈ అమ్మడు మెల్ల మెల్లగా ఆఫర్లు దక్కించుకుంటూ ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తుంది. టాలీవుడ్ లో ఈ అమ్మడు చేసిన మొదటి ప్రయత్నం కమర్షియల్ గా నిరాశ పరిచింది. దాంతో మళ్లీ ఈ అమ్మడికి తెలుగు లో ఆఫర్లు వస్తాయా అంటే డౌటే అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల్లో ఆఫర్లు వచ్చినా రాకున్నా కూడా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు బ్లాక్ డ్రెస్ లో తన క్యూట్ అందాల ఫోటోలను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. పొట్టి బ్లాక్ డ్రెస్ లో మానుషి చిల్లర్ అందం అదరహో అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందంగా ఉన్న మానుషికి టైం కలిసి రావడం లేదని, ముందు ముందు అయినా ఈ అమ్మడు బాలీవుడ్ లో బిజీ అవుతుందేమో చూడాలి.



# 'గీత గోవిందం' ను గుర్తుచేస్తున్న 'ఫ్యామిలీ స్టార్' ట్రైలర్!




పరశురామ్ దర్శకత్వంలో విజయ దేవరకొండ హీరోగా చేసిన 'ఫ్యామిలీ స్టార్' కోసం అభిమానులంతా వెయిట్ చేస్తున్నారు. దిల్ రాజు నిర్మించిన ఈ సినిమాకి గోపీసుందర్ సంగీతాన్ని సమకూర్చాడు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించిన ఈ సినిమా నుంచి కొంతసేపటి క్రితం ట్రైలర్ ను వదిలారు. 'నేను నీ లైఫ్ లోకి రావడమే ప్రోబ్లమ్' వంటి డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి.

లవ్ .. యాక్షన్ .. ఎమోషన్ .. డ్రామా .. కామెడీ ప్రధానమైన సన్నివేశాలపై కట్ చేసిన ఈ ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. విజయ్ దేవరకొండ నుంచి అతని తరహా బాడీ లాంగ్వేజ్ లోని కథనే ప్రేక్షకులు కోరుకుంటున్నారు. అలాంటి కంటెంట్ కి దూరమైన విజయ్ దేవరకొండ ఈ సినిమాతో మళ్లీ దారిలో పడినట్టుగా అనిపిస్తోంది.

గతంలో పరశురామ్ - విజయ్ దేవరకొండ కలిసి 'గీత గోవిందం'తో మేజిక్ చేశారు. అలాంటి ఒక మేజిక్ మళ్లీ జరగనుందనే నమ్మకాన్ని ఈ ట్రైలర్ కలిగిస్తోంది. టైటిల్ కి తగినట్టుగా కంటెంట్ లో ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా కనిపిస్తున్నాయి. కనుక ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యే అవకాశాలు పుష్కలంగా వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 5వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

# మంచులో ఎంజాయ్ చేస్తున్న మహేశ్ బాబు కుటుంబం!



తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. పగటి పూటి ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. మరోవైపు, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు కుటుంబం సమ్మర్ వెకేషన్ కు స్విట్జర్లాండ్ వెళ్లింది. అక్కడ మంచులో ఎంజాయ్ చేస్తోంది. మహేశ్ భార్య నమ్రత, కొడుకు గౌతమ్, కూతురు సితారలు స్విట్జర్లాండ్ కు వెళ్లారు. సినిమా షూటింగ్ లో మహేశ్ బాబు బిజీగా ఉండటం వల్ల ఆయన వెళ్లలేదు. మంచులో మహేశ్ ఫ్యామిలీ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను నమ్రత ఇన్స్టాలో పోస్ట్ చేశారు. హాట్ సమ్మర్ లో కూల్ గా ఎంజాయ్ చేస్తున్నారంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు.

# 'ఫైటర్ రాజా'.. విశ్వక్ సేన్ లాంచ్ చేసిన థ్రిల్లింగ్ టీజర్!

టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకూ ఎంతో మంది హీరోలకు స్టైలిస్ట్‌గా పనిచేసిన పాపులర్ ఫ్యాషన్ డిజైనర్ రామ్జ్.. 2021లో 'పచ్చీస్' అనే సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసాడు. ఇప్పుడు 'ఫైటర్ రాజా' అనే స్టైలిష్ యాక్షన్ మూవీతో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయ్యాడు. కృష్ణ ప్రసాద్ వత్యం ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాయా కృష్ణన్ హీరోయిన్ గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇటీవల 'ఓం భీమ్ బుష్' నటులు శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కలిసి ఆవిష్కరించిన 'ఫైటర్ రాజా' ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో గురువారం (మార్చి 28) హైదరాబాద్ లోని %ూాూా% సినిమాస్ లో గ్రాండ్ గా టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఈ సినిమా టీజర్ ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి తన బెస్ట్ విషెస్ అందజేశారు. %ూశ్రీంశీ =ముఃు% - సూపర్ స్టార్ కూతురును చూశారా...! "మా అయ్య కన్స్ట్రక్షన్ సైట్ లేబర్ అన్నా.. స్క్రాప్ అమ్ముకొని డబ్బులు చేసుకునే కాన్సెప్ట్ మా అయ్య చెప్పిందే.. నా అసలు జాబ్ ఫైటర్ అన్నా" అంటూ హీరో రామ్స్ తనను తాను పరిచయం చేసుకోవడంతో ఈ టీజర్ ప్రారంభమవుతుంది. స్క్రాప్ అమ్మడం ద్వారా డబ్బు సంపాదించే రాజా.. ఫైటింగ్స్ మీద మక్కువతో సినీ ఇండస్ట్రీలో ఫైటర్‌గా పని చేస్తున్నాడు. అతని ప్రేయసి మాయా కృష్ణన్ కూడా అదే ఫీల్డ్ లో వర్క్ చేస్తోంది. అయితే రాజా తనకున్న సమస్యలకు పరిష్కారించుకోడానికి చిన్న చిన్న సెటిల్మెంట్స్ చేయడం ప్రారంభిస్తాడు. ఈ క్రమంలో ఏదో పెద్ద ప్లాన్ వేసి, ఒకరి నుండి డబ్బుతో పాటుగా ఒక గన్ దొంగిలించి తప్పించుకోవడంతో అసలు కథ మొదలైనట్లు 'ఫైటర్ రాజా' టీజర్ లో కనిపిస్తోంది. ఇందులో 'మన దగ్గర ఏదైనా కొనేంత డబ్బైనా ఉండాలి. డబ్బు కూడా కొనలేని పవర్ అయినా ఉండాలి' అనే డైలాగ్ ఆకట్టుకుంటోంది. రాంజ్ విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలో మంచి ఈజ్ తో నటించాడు. అతని క్యారెక్టర్ సీరియస్ గా కనిపించినా ఫన్ జనరేట్ చేసింది. మాయా కృష్ణన్ ఒక లేడీ ఫైటర్ గా యాక్షన్ సీన్స్ లో ఆశ్చర్య పరిచింది. దీంట్లో సీనియర్ నటుడు తనికెళ్ల భరణి నెగిటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో నటించినట్లు తెలుస్తుంది. టెక్నికల్ గా కూడా కూడా సినిమా బాగుంది. శ్రీధర్ కాకిలేటి దీనికి సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతం సమకూర్చారు. హరిశంకర్ %ు% అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. వినూత్న కథాంశంతో అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునే కమర్షియల్ ఎలిమెంట్స్ తో 'ఫైటర్ రాజా' సినిమాని రూపొందించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఇందులో చక్రధర్, శివనందు, రోషన్, తాగుబోతు రమేష్, సత్య ప్రకాష్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. రన్‌వే ఫిల్మ్స్ బ్యానర్ పై దినేష్ యాదవ్, పుష్పక్ జైన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే ఈ మూవీ విడుదల తేదీని ప్రకటించనున్నారు.

